క్లుప్తంగా

విశేష శ్వేతా వర్ణ అలంకరణలో శ్రీవారు



విశేష శ్వేతా వర్ణ అలంకరణలో శ్రీవారు

సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లి శ్రీ రామాలయం,శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనుర్మాసంలో భాగంగా కల్యాణ వెంకటేశ్వర స్వామి శనివారం ప్రత్యేక అలంకారంలో భాగంగా విశేష శ్వేతా వర్ణ అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు 15వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం సత్తెనపల్లి పట్టణంలోని వడ్డవల్లి సచివాలయ పరిధిలోని 15వ వార్డులో ఆదివారం ఉదయం 6.00 గంటలకు జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మీ శనివారం తెలిపారు. పట్టణంలోని పశువైద్యశాల వద్ద నుంచి ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి హాజరవుతారన్నారు. పట్టణం లోని కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, అన్ని శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు ఫణిదంలో వైద్య శిబిరం

సత్తెనపల్లి: మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉచిత వైద్య శిబిరం శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కిరణ్ శనివారం తెలిపారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్ ఉన్నవారికి వైద్య పరీక్షలు చేసి సలహాలు అందిస్తారన్నారు. నేత్ర సమస్యలు ఉన్నవారికి నేత్రవైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి దశలవారీగా శుక్లం ఆపరేషన్లు చేసి ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ చేయబడతాయన్నారు. పైసా ఖర్చు లేకుండా అందరికీ అందుబాటు లో ఉన్న ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు : 98481 30533 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో ప్రమాద బీమా పాలసీలు



బీమా పాలసీల నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పోస్టల్ అధికారులు

నకరికల్లు: అతితక్కువ ప్రీమియం రూ.399లతో రూ.10 లక్షల ప్రమాదబీమా కల్పిస్తున్నట్లు నరసరావుపేట పోస్టల్‌శాఖ ఏఎస్‌పి జి.శ్రీనివాసరావు తెలిపారు. పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో ప్రమాదబీమా పాలసీల నమోదు కార్యక్రమాన్ని శనివారం నకరికల్లులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్‌శాఖ ప్రజాప్రయోజనాల కోసం విన్నూత్న పథకాలు అమలు చేస్తోందని ప్రజలు, ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐపీబీపీ అసిస్టెంట్ మేనేజర్ కె.సరస్వతి, సబ్‌పోస్ట్‌మాస్టర్ కె.వెంకటేశ్వర్లు, నకరికల్లు సబ్‌పోస్టాఫీసు పరిధిలోని పోస్టల్ సిబ్బంది, ఏజంట్లు పాల్గొన్నారు.

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న నాటు సారా, ముద్దాయితో ఎస్ఐ సుధీర్‌కుమార్

బెల్లంకొండ: నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి శనివారం సాయంత్రం కోర్టుకు హాజరు పరిచినట్లు స్థానిక ఎస్ఐ ఎల్.సుధీర్‌కుమార్ తెలిపారు. మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో నాటు సారా విక్రయిస్తున్నారన్న సమాచారంతో శనివారం ఎస్ఐ సుధీర్ కుమార్ పోలీసులు మెరుపు దాడులు చేశారు. నాటుసారా విక్రయిస్తున్న గ్రామానికి చెందిన సంగు హుస్సేన్ అనే వ్యక్తి వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న 12 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. తెలంగాణాకు చెందిన మేళ్లచెరువు మండలం వెల్లటూరుకు చెందిన ఒక వ్యక్తి వద్ద సారా కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు విచారణలో తెలిసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. హుస్సేన్‌పై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచామన్నారు. ఎస్ఐ వెంట సిబ్బంది రాజేష్, ఎల్ వి, వెంకట్రావు, బాజీ, రామకృష్ణ పాల్గొన్నారు.

చెప్పాడంటే...చేస్తాడంతే

మంత్రి అంబటి రాంబాబు



ముప్పాళ్ళలో జరిగిన పింఛన్ వారోత్సవ సభలో మాట్లాడుతున్న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

ముప్పాళ్ళ: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మడమ తిప్పని ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పింఛన్ వారోత్సవాల్లో భాగంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద నూతనంగా మంజూరైన పింఛన్లను, పెంచిన నగదు సాయాన్ని శనివారం పంపిణీ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మాట ఇచ్చాడంటే..చేస్తాడని..వీటితో పాటుగా ఇవ్వని హామీలను సైతం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వృద్ధులు, వితంతులు, వికలాంగులకు పెంచిన పింఛన్ సాయంతో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. పింఛన్ సాయం పెంపుదలపై లబ్ధిదారుల్లో సంతృప్తి వ్యక్తం అవుతుందన్నారు. ఎన్నికల నాటికి ఇచ్చిన మాట ప్రకారం రూ.3వేలు పింఛన్‌సాయం అందిస్తామన్నారు. ఈ నెలల కొత్తగా 206 పింఛన్‌లు మంజూరయ్యాయని, మొత్తం 5,942 మందికి ప్రతి నెలా రూ.5,82,000 లు అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వ పాలనకు, నేటి పాలనకు బేరీజు వేసుకోవాలన్నారు. మరలా వచ్చే ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. ఈ సందర్భంగా నూతనంగా లబ్ధిదారులకు పింఛన్ సాయాన్ని అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ మారూరి పద్మ, జెడ్పీటీసీ శిరిగిరిచంద్రకళ, సర్పంచ్ మెడబలిమి సతీష్, వైఎస్ఎంపీపీ రాయన్న, తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్‌జెఎమ్ రామలింగారెడ్డి, రెండెద్దులవెంకటేశ్వర రెడ్డి, శిరిగిరిగోపాలరావు, సొసైటీ అధ్యక్షుడు అన్నపురెడ్డి సాయిరెడ్డి, సర్పంచ్ చయికంవెంకటప్పారెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు, యనమాలసింగయ్య, కోఆప్షన్‌సభ్యుడు అజ్గర్‌ఆలీ, పీలాలక్ష్మయ్య, నక్కాశ్రీనివాసరావు, గద్దలకృపారావు, ఖాశిం, హుస్సేన్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి మండల స్థాయి ముగ్గుల పోటీలు



సత్తెనపల్లిలో ముగ్గుల పోటీలకు సిద్ధం చేసిన స్థలం

సత్తెనపల్లి: సంప్రదాయాలను కొనసాగిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏటా సత్తెనపల్లి నియోజకవర్గస్థాయి వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ఈ నెల మూడు నుంచి ప్రారంభమైన ముగ్గుల పోటీలు గ్రామ, వార్డు స్థాయిలో ఈ నెల 6తో ముగిశాయి. ఈ నెల 8 నుంచి 10 వరకు మండలాలు, మున్సిపాలిటీ స్థాయిలో ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలతో 12న నియోజకవర్గ స్థాయిలో ముగ్గుల పోటీలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దీనిలో భాగంగా ఈనెల 8న మధ్యాహ్నం 3 గంటలకు నకరికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నకరికల్లు మండల స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. ఈనెల 9న ఉదయం 10 గంటలకు పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గల సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మున్సిపాల్టీ స్థాయి ముగ్గుల పోటీలను నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు రాజుపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో రాజుపాలెం మండల స్థాయి ముగ్గుల పోటీలను నిర్వహించనున్నారు. ఈ నెల 10న ఉదయం 10 గంటలకు ముప్పాళ్ళలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయ ప్రాంగణంలో ముప్పాళ్ళ మండల స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం మూడు గంటలకు సత్తెనపల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గల సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సత్తెనపల్లి రూరల్ మండల స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. ఆయా పోటీలకు గ్రామ, వార్డు స్థాయి ముగ్గుల పోటీల్లోని విజేతలతో మండల స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. మండల, మున్సిపాల్టీ స్థాయి ముగ్గుల పోటీల్లోని విజేతలతో ఈ నెల 12న నియోజకవర్గ స్థాయి ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం చేయనున్నారు. మండల, మున్సిపాల్టీ స్థాయి ముగ్గుల పోటీల్లో పాల్గొనే మహిళలతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

నేడు పెదకూరపాడు తిరునాళ్ల



విద్యుత్ కాంతులతో పెదకూరపాడు ముగ్గురు రాజుల దేవాలయం

పెదకూరపాడు : పెదకూరపాడు ముగ్గురు రాజుల తిరునాళ్లకు సర్వం సిద్ధమైంది. తిరునాళ్ల సందర్భంగా ముగ్గురు రాజుల దేవాలయం విద్యుత్ దీపాలతో విరసిల్లుతుంది. అమరావతి- సత్తెనపల్లి రహదారి పై సందడి వాతవర్ణం నెలకొంది. గత 25 సంవత్సరాలుగా వైభవంగా మహోత్సవం నిర్వహిస్తున్నారు. చుట్ట పక్కల గ్రామాలతో పాటు జిల్లాలో పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాలయేసును సందర్శించి మొక్కులు తీర్చుకుంటారు. ఈ సందర్భంగా స్థానిక విచారణ గురువులు పాదర్ రెవరెండ్ పుట్టి సుందరరాజు మాట్లాడుతూ తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండ అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు తెలిపారు. పండుగ సందర్భంగా దివ్యపూజ బలి ని గుంటూరు పీఠాధిపతులు రెవరెండ్ చిన్నాబత్తిన భాగ్యయ్య, కడప బిషప్ డాక్టర్ రెవరెండ్ గాలి బాలిలు నిర్వహిస్తామన్నారు. అనంతరం కొవ్వత్తుల కానుకల సమర్పణ, రాత్రి 9 గంటలకు బాణా సంచాలతో గ్రామ వీధుల్లో తేరు ప్రదక్షించబడుతుందన్నారు. రంగుల రాట్నం, దుకాణాలు పెట్టుకునేందుకు ప్రత్యేకంగా స్థలం కేటాయించినట్లు తెలిపారు.

అగ్రిల్యాబ్ భవనాలను పరిశీలించిన ఎమ్మెల్యే



ల్యాబ్‌లకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: స్థానిక వ్యవసాయ పరిశోధన కేంద్రంలో 2018వ సంవత్సరంలో రూ. 25కోట్లరూపాయల నిధులతో మొదలుపెట్టి ఇప్పటి వరకు పూర్తికాని భవనాలను శనివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పరిశీలించారు. ఈసందర్భంగా డిఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ మరియు జన్యుమార్పిడి పంటల పర్యవేక్షణ ప్రయోగశాలను, పెస్టిసైడ్స్ టెస్టింగ్ లాబోరేటరి, ఫర్టిలైజర్, బయో ఫెర్టిలైజర్ ల్యాబ్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ కల్తీ విత్తనాలు, కల్తీ ఎరువులను నివారించేందుకు వీలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏకైక డీఎన్ఏ ల్యాబోరేటరీకి సంబందించిన భవనాలు నిరుపయోగంగా ఉండడాన్ని వ్యవసాయ శాఖమంత్రి, ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లి వాటిని వెంటనే ప్రారంభించే విధంగా కృషి చేస్తానన్నారు. ఈసందర్భంగా భవనాల వివరాలను మండల వ్యవసాయశాఖాధికారి అహ్మద్ ఎమ్మెల్యే శంకరరావుకు వివరించారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాకెట్ మనీతో ప్రగతి విద్యార్థుల దాతృత్వం



పేద వ్యక్తికి దుప్పటి కప్పుతున్న ప్రగతి విద్యార్థి

సత్తెనపల్లి: పట్టణంలోని ప్రగతి హై స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు రోడ్డు పక్కన నివశించే యాచకుల పరిస్థితి చూసి వారి హృదయం చలించి, అనుకున్నదే తడవుగా పాఠశాల ఉపాధ్యాయులైన సుజాత, హెప్సీబా ప్రోత్సాహంతో తాము దాచుకున్న పాకెట్ మనీతో దుప్పట్లు కొనుగోలు చేసి శనివారం ఉదయం పేద ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రగతి విద్యా సంస్థల అధినేత డాక్టర్ మక్కెన అచ్చయ్య, ప్రిన్సిపల్ షేక్.మస్తాన్ వలి, తదితరులు అభినందించారు.

బాలబాలికలు రక్త హీనతను అధిగమించాలి



ఆరోగ్య ఉపకేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న దస్తగిరి

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): బాల బాలికల్లో రక్త హీనత లేకుండా చూడాలని సామాజిక పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయ అధికారి కె.దస్తగిరి చెప్పారు. పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేర మండలంలోని చాగంటివారిపాలెం సచివాలయం, ఆరోగ్య ఉపకేంద్రాన్ని శనివారం పరిశీలించారు. బాల, బాలికలకు ప్రతి నెలా హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి చెప్పారు. గర్భిణులు రక్త హీనతతో ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు చేసే వారికి రెండేళ్ళ జైలుశిక్ష, లక్ష రూపాయల జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం బాల్య వివాహాలను నివారించేందుకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. బడి ఈడు గల పిల్లలను బడికి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేలం పాట ద్వారా రూ.4.81లక్షలు ఆదాయం



వాహనాలకు వేలం నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

అచ్చంపేట: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో పెదకూరపాడు సీఐ కె.వీరాస్వామి సమక్షంలో శనివారం నిర్వహించిన వేలం ద్వారా రూ.4,81,565ల ఆదాయం వచ్చినట్లు ఎస్ఐ కె.పాల్ రవీంద్ర తెలిపారు. మొత్తం 15 బైక్‌లు, ఒక ఆటోకు వేలం నిర్వహించారు. బైకులను వివిధ గ్రామాలకు చెందిన వారు వేలంద్వారా సొంతం చేసుకున్నారు. ఆటోకు అప్‌సెట్ ధర ఎక్కువగా ఉండడంతో ఎవరూ పాడుకునేందుకు ముందుకు రాలేదు. వేలంలో మొత్తం 54 మంది పాల్గొన్నారు. వీటి మొత్తానికి అప్‌సెట్ ధర రూ.1,85,600లుగా నిర్ణయించగా వేలంలో రూ.4,81,565లు పలికాయి. ఈ సందర్భంగా సీఐ కె.వీరాస్వామి మాట్లాడుతూ వేలం ద్వారా వాహనాలు తక్కించుకున్న వారు సొంత ఖర్చులపై రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. తన సర్కిల్ పరిధిలోని బెల్లంకొండ, క్రోసూరు, పెదకూరపాడు, అమరావతి మండలాలలో కూడా త్వరలో పట్టుబడిన వాహనాలకు వేలం నిర్వహిస్తామని చెప్పారు. అచ్చంపేటలో లాగానే మిగతా మండలాలలో జరిగే వేలంలో పాల్గొనవలసినదిగా కోరారు.

బీసీ వసతి గృహన్ని సందర్శించిన బీజేపీ నాయకులు



బీసీ వసతి గృహంలో బీజేపీ నాయకులు

సత్తెనపల్లి: బీజేపీ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ వసతి గృహ సందర్శనలో భాగంగా సత్తెనపల్లి పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో గల బీసీ బాలుర వసతి గృహన్ని స్థానిక బీజేపీ నాయకులు శనివారం సందర్శించారు. ముందుగా వార్డెన్ రత్నబాబుద్వారా విద్యార్థులకు అందుతున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కూడా మాట్లాడి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. వంటశాల ను పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ సత్తెనపల్లి పట్టణ అధ్యక్షులు దివ్వెల శ్రీనివాసరావు, ఓబీసీ నాయకులు గడ్డం శివ శంకర రావు, ఎద్దులదొడ్డి రమేష్, బీజేపీ నాయకులు నోముల వెంకట చలపతిరావు, విశ్వనాదుని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట : స్థానిక బీసీ బాలికల వసతి గృన్ని బీజేపీ నాయకులు శనివారం సందర్శించారు. వసతులను పర్యవేక్షించారు. మధ్యాహ్న భోజన పథాన్ని పరిశీలించారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు



లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: ప్రజలకు ఇప్పటివరకు చేసిన మేలును వివరిస్తూ మీగడపలోనే సమస్యలను పరిష్కరించడానికి వచ్చామని పెదకూరపాడు శాసన సభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. శనివారం అమరావతి-1 సచివాలయం పరిధిలో మూడవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్నంమాలపల్లిలో ఉన్న సైడ్‌కాల్వ సమస్యలను ఎమ్మెల్యే శంకరరావు దృష్టికి స్థానికులు తీసుకురాగ ఆయన అధికారులతో చర్చించి ఇప్పటికే సగం సైడ్‌కాల్వ పూర్తిచేశామని మిగినది కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. అలాగే రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇళ్లస్థలాల కేటాయింపులో ఎటువంటి వివక్ష లేకుండా అర్హులైన వారందరికి కేటాయించేలా వలంటీర్లు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వివేకానందనగర్‌లో ఎంతోకాలంగా మురుగునీరు బైటకి పోయేదారి లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే శంకరరావు దృష్టికి తీసుకురాగా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలు వింటూ వాటిని అధికారులతో చర్చించి వెంటనే పరిష్కారాలను సూచిస్తూ ముందుకు సాగారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ మూడున్నరేళ్ల కాలంలో పేదల జీవితాల్లో సంక్షేమ అభివృద్ధి పథకాల ద్వారా వెలుగులు నింపిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. కరోనా సంక్షోభంలోను ముఖ్యమంత్రి అమలు చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలు చూసి ఆశీర్వదించాలన్నారు. వైఎస్సార్ సీపీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్ష టీడీపీ నాయకులు చేసే అసత్య ఆరోపణలను 2024ఎన్నికల్లో ప్రజలు తిప్పికొడతారన్నారు. అమరావతి గ్రామంలో రూ. 15కోట్లరూపాయల మేర సంక్షేమ ఫలాలు అందించామని, అలాగే రెండు కోట్ల రూపాయల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు శనివారం నాడు 300 గడపలను సందర్శించి వారికి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించి జగనన్నను, తనను ఆశీర్వదించమని కోరారు. ఈసందర్భంగా పార్టీ నాయకుడు మంగిశెట్టి కోటేశ్వరరావు రూపొందించిన వైఎస్సార్ సీపీ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే శంకరరావు ఆవిష్కరించారు. డీసీసీబీ డైరెక్టర్ కోట హరిబాబు, జెడ్పీటీసీ ఈదుపుగంటి కరుణకుమారి, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ షేక్ హుష్మీ, మండల పార్టీ అధ్యక్షుడు మంగిశెట్టి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ పాలపర్తి రాజేశ్వరి ఉపసర్పంచ్ నిమ్మా విజయసాగర్ బాబు, ఎంపీటీసీ గుడిశె అనూషా, పార్టీ నాయకులు మంగిశెట్టి కోటేశ్వరరావు, అలాలక్ష్మీనారాయణ, నండూరికరుణకుమార్, విన్నకోటసాంబశివరావు, శివరామకృష్ణ, పి.రోశిబాబు, నంబూరుబాబురావు, ఆళ్లశ్రీనివాసరెడ్డి, భవిరిశెట్టి హనుమంతరావు తదితరులతో ప్రజాప్రతి నిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు.

గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలి

- ఆరో వార్డు కౌన్సిలర్ సదనం సత్యవాణి
- 50 పక్కా గృహాల నిర్మాణానికి శంకుస్థాపనలు



గృహ నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న కౌన్సిలర్ సత్యవాణి, లబ్ధిదారులు

సత్తెనపల్లి: పక్కా గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆరో వార్డు కౌన్సిలర్ సదనం సత్యవాణి అన్నారు. పట్టణంలోని 6వ వార్డులో నివసిస్తున్న పేదలకు నవరత్నాలు - అందరికీ ఇళ్ళులో భాగంగా సత్తెనపల్లి మండలం పాకాల పాడు అడ్డరోడ్డు వద్ద ఏర్పాటు చేసిన లేఔట్ లో శనివారం 50 ఇళ్ల నిర్మాణాలకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సత్యవాణి మాట్లాడుతూ లబ్ధిదారులు దగ్గరుండి గృహ నిర్మాణాలను పూర్తి చేయించు కోవాలన్నారు. ఆప్షన్ త్రి కింద కాంట్రాక్టర్ ద్వారా నిర్మాణం చేయిస్తున్న ఇళ్లను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణాలను త్వరిత గతినపూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకుడు సదనం హరి, గృహ నిర్మాణశాఖ ఏఈ సుబ్బారావు, తదితరులు ఉన్నారు.

దరఖాస్తులు ఎప్పటికప్పుడు కార్యాలయానికి పంపాలి

తహసీల్దార్ సురేష్



వీఆర్వోలకు సూచనలిస్తున్న తహసీల్దార్ సురేష్

నకరికల్లు: ఆదాయ, కులధృవీకరణ దరఖాస్తులను మొబైల్‌లో అప్‌లోడ్ చేసి సంబంధిత ప్రాఫార్మాలో పొందుపరచి ఎప్పటికప్పుడు కార్యాలయంలో అందజేయాలని తహసీల్దార్ ఎస్.సురేష్ వీఆర్వోలకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వీఆర్వోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు అందరూ పనిచేస్తున్న సచివాలయంలో బయోమెట్రిక్ హాజరు నమోదు చేసుకోవాలన్నారు. రైస్‌కార్డు దరఖాస్తుల ఈ-కేవైసి పెండింగ్ లేకుండా పూర్తిచేయాలన్నారు. స్పందన దరఖాస్తులను పరిశీలించి పరిష్కారానికి సత్వరచర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ గణనను సంబంధిత యాప్ ద్వారా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.